సాక్షి

వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 10 । జూలై । 2025



రిమ్స్‌లో 'దళారుల దందా'..!

దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్, నూతన సర్టిఫికెట్లను ఇప్పించే విషయంలో దళారుల దందా యథేచ్ఛగా జరుగుతోంది. - 4లో



క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక

డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025-26 సంవత్సరంలో నాలుగో తరగతి ప్రవేశాలకు బుధవారం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి - 4లో

గరిష్టం/కనిష్టం
37.4 /27.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.5 - 37.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 57.83 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

– డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఉపాధ్యాయులు జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ దరఖాస్తులను జులై 13వ తేదీ వరకు ఆన్‌లైన్ పోర్టల్ htt pr://nationalawardstoteachers.education.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ తెలిపారు. అర్హతలు, ఇతర సమాచారం కోసం పై వెబ్‌సైట్‌నే సంప్రదించాలని డీఈఓ పేర్కొన్నారు.

ఢిల్లీ వర్క్‌షాప్‌లో కలెక్టర్



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వ బొగ్గు, ఖనిజ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణపై బుధవారం న్యూ ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి వర్క్ షాప్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, భారత ప్రభుత్వ ఖనిజ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డీఎల్ కాంతారావు, వివిధ రాష్ట్రాల జిల్లా కలెక్టర్లు, గనులు, భూగర్భ శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణ ప్రణాళిక, అమలు అనే అంశంపై నియమించిన కమిటిలో జిల్లా కలెక్టర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా భారత బొగ్గు , గనుల మంత్రిత్వశాఖ తరుపున కలెక్టర్‌కు జ్ఞాపిక అందించి సత్కరించారు.

11న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 11న కడప నగర శివార్లలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులోని టిరోవిజన్ కంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియేట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, డిగ్రీ చదివి 18 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి అర్హతనుబట్టి రూ. 10-50 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

నేడు జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రుల సమావేశం

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నేడు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా 4 నుంచి 10వ తరగతి విద్యార్థుల చేత మొక్కలు నాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. దీని కోసం ప్రభుత్వం ఒక్కో మొక్కకు రూ. 7.85 కేటాయించి నిధులను విడుదల చేసింది. ఒక్కో విద్యార్థి తమ తల్లి పేరుతో మొక్కనాటేలా రిజిస్ట్రేషన్ చేయించారు. అలాగే విద్యార్థి ప్రొగ్రెస్, హోలిస్టిక్ రిపోర్టు పేరుతో విద్యార్థి అభ్యసన, ఆరోగ్య తదితర వివరాలు అందులో పొందుపరిచి చర్చించడంతోపాటు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమలను తెలియచేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో 2818 ప్రభుత్వ, ప్రైవేటు బడులతోపాటు 155 ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల్లో కూడా నిర్వహించనున్నారు.

వెబ్ ఆప్షన్స్ నమోదుకు 12 వరకు అవకాశం

రాయచోటి జగదాంబసెంటర్ : రెండు సంవత్సరాల డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సుకు జరిగిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు డైట్‌లో సీటు పొందడానికి ఆన్‌లైన్ వెబ్ ఆధారంగా ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు ఈ నెల 9 నుంచి 12 వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటిలోని డైట్ విద్యా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకున్న వారికి సీట్లు కేటాయించి ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 25 నుంచి డైట్‌లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయన్నారు. రాయచోటి డైట్ తెలుగు మీడియంలో 50, ఆంగ్ల మాధ్యమంలో 50, ఉర్దూ మాధ్యమంలో 50 సీట్లు ఉన్నాయన్నారు. డీఈఈసెట్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా రెండేళ్ల డీఈఎల్ఈడీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు డైట్ సీనియర్ లెక్చరర్ మడితాడి నరసింహారెడ్డిని (9440246825 నంబర్‌లో) సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డైట్ లెక్చరర్స్ వైసీ రెడ్డప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బీమాకు మంగళం

అన్నదాతల నెత్తిన ప్రీమియం పిడుగు

- ఈ ఖరీఫ్ నుంచి ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు
- వైఎస్సార్‌జిల్లాలో 10 పంటలకు బీమా
- వరి గ్రామం యూనిట్‌గా పత్తి,వేరుశనగ, బత్తాయి, అరటి మండల యూనిట్‌గా అమలు
- కంది, జొన్న, మినుము, పసుపు, ఉల్లి జిల్లా యూనిట్‌గా అమలు



ఖాజీపేట మండలం మునిపాక వద్ద పెన్నానది సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కడప అగ్రికల్చర్ : రైతు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించి రైతులపై భారం మోపుతోంది. ప్రీమియం సొమ్ము చెల్లిస్తేనే పంటల బీమా వర్తించేలా మార్గదర్శకాలను జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో అన్నదాతలపై కోట్లాది రూపాయల ప్రీమియం భారం పడుతోంది. అసలే అన్నదాత సుఖీభవ ఎప్పుడందుతుందో తెలియక అన్నదాతలు సాగుకు పెట్టుబడుల కోసం దిగులు చెందుతున్న నేపథ్యంలో ప్రీమియం సొమ్ము చెల్లించాలంటూ అధికారులు తెస్తున్న ఒత్తిడితో తలకు మించిన భారంగా మారిందంటూ అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ప్రీమియం చెల్లిస్తేనే బీమా...

తాజాగా ఉచిత పంటల బీమా వర్తింపును రద్దు చేసి ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు అమలు చేస్తున్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు ఉచిత పంటల బీమాను అమలైనా అధిక వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నప్పటికీ ఒక్క రూపాయి పరిహారం అందివ్వని పరిస్థితి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ భీమా, వాతావరణ ఆధారిత బీమా అమలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రీమియం చెల్లిస్తేనే భీమా వర్తింపు విధానం అమలు చేస్తుండటంపై రైతుల నుంచి సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఈ ఖరీఫ్ సీజన్‌లో...

జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,93,722 ఎకరాల్లో పలు పంటలు సాగు కానున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, పసుపు, పత్తి, ఉల్లి, అరటి, మినుము, కంది వంటి పంటలను సాగు చేయనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పంటల సాగుకు ఉపక్రమించారు. ప్రస్తుతం జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాల్లో వరి నారుమడులను ముమ్మరంగా పోయడంతోపాటు వరినాట్లు వేస్తున్నారు. దీంతోపాటు పసుపు, ఉల్లి, వంగ, అరటి వంటి పంటలను కూడా సాగు చేస్తున్నారు.

కూటమి సర్కార్ కక్ష..

పంటల బీమా నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకుంది. దీంతో పంటల బీమా చెల్లింపు రైతు నెత్తిన పండింది. ప్రధానమంత్రి పసల్ భీమా యోజన కింద వరి, కంది, జోన్న , మినుము, పసుపు, ఉల్లి పంటలను అమలు చేయగా, వాతావరణ ఆధారిత పంటల బీమా కింద పత్తి, వేరుశనగ, చీనీ, అరటి పంటలను ఎంపిక చేసింది. ఇందులో వరిని మాత్రం గ్రామం యూనిట్ కింద ఎంపిక చేయగా పత్తి, వేరుశనగ, చీని, అరటి పంటలను మాత్రం మండల మూనిట్‌గా ఎంపిక చేసింది, మిగతా కంది, జొన్న, పసుపు, ఉల్లి పంటలను మాత్రం జిల్లా యూనిట్‌గా ఎంపిక చేసింది.

వైఎస్సార్‌పాలనలో రూ.1063.21 కోట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి సంవత్సరం అంటే 2019-20లో కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిపై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది. 2020-21 నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. నోటిపై చేసిన పంటలు ఈ క్రాపులో నమోదైతే చాలు పంటల బీమా సదుపాయం కల్పించే ఏర్పాటు చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. 2019- 20 నుంచి 2022-23 వరకు ఉచిత పంటల బీమా కింద 380475 మంది రైతన్నలకు రూ. 1063.21 కోట్లు నేరుగా రైతులు బ్యాంకు ఖాతాలకు జమ చేసింది, ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే బీమా పరిహారం విడుదల చేయడం వల్ల రైతలకు ఊరట లభించేది.

> **జులై 15లోపు బీమా చెల్లించాలి**
>
> 
>
> 2025-26 సంవత్సరానికి వాతావరణ ఆధారిత పంటల బీమాకు సంబంధించిన పత్తి, వేరుశనగ, చీని, అరటి పంటలకు సంబంధించిన ప్రీమియంను జులై 15వ తేదీలోపు చెల్లించాలి. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమాకు సంబంధించిన కంది, జొన్న, మినుము, పసుపు, ఉల్లి పంటలకు జులై 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలి. వరి పంటకు మాత్రం ఆగస్టు 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లింపునకు గడువు ఉంది.
>
> – చంద్రనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి. వైఎస్సార్‌జిల్లా.

రైతులు చెల్లించాల్సిన బీమా వివరాలు ఇలా...

పంట	ఇన్సూరెన్స్ యూనిట్	రైతు వాట శాతం	రైతు చెల్లించాల్సింది ఎకరాకు (రూపాయల్లో)
వరి	గ్రామం	0.20	84
కంది	జిల్లా	0. 20	36
జొన్న	జిల్లా	0. 20	38
మినుము	జిల్లా	0. 20	38
పసుపు	జిల్లా	0. 20	180
ఉల్లి	జిల్లా	0. 20	90
పత్తి	మండలం	5,.00	2000
వేరుశనగ	మండలం	2.00	560
చీని	మండలం	5.00	2750
అరటి	మండలం	5.00	3075

వైభవం.. సౌమ్యనాథుని గరుడోత్సవం

నందలూరు : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం రాత్రి స్వామివారు శ్రీ మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గరుడవాహనసేవ దిగువవీధి, పేటగడ్డ, బస్టాండ్ మీదుగా అరవపల్లి వరకు సాగింది.గరుడ సేవ తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు.అరవపల్లిలో శ్రీ ముత్తు మారెమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విడిదిలో ఉభయదారులు కుర్ర మణియాదవ్, ప్రభావతి దంపతులను మంగళవాయిద్యాలతో ఆహ్వానించి పూజలు జరిపించారు. బుధవారం ఉదయం పుష్పాలంకరణ ప్రియుడైన సౌమ్యనాథస్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాఢవీధుల్లో విహరించారు.ఊరేగింపు సందర్భంగా కడపకు చెందిన గణేష్ కోలాటం బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

బ్రహ్మోత్సవాలలో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం ఉదయం శ్రీ సౌమ్యనాధ స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



గరుడవాహనంపై దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

కళ్లు తెరిచిన కూటమి పెద్దలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో తమ సమస్యలు విన్నవిస్తున్న ఏఎఫ్‌యూ విద్యార్థులు (ఫైల్)

- డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ అడ్మిషన్లు చేపట్టేందుకు ఉత్తర్వులు
- మెరిట్ ప్రాతిపదిక అడ్మిషన్లు చేపట్టాలని హయ్యర్ ఎడ్యుకేషన్ ఆదేశాలు
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్‌కు స్పందన
- సీఓఏ అనుమతులకు కృషి చేయాల్సిందిగా విద్యార్థుల విన్నపం

సాక్షి ప్రతినిధి, కడప : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం వీడింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగిన విద్యార్థుల ఉద్యమానికి తోడు ..వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌కు ప్రభుత్వంలో చలనం వచ్చింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటైన రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయంపై సవతి తల్లి ప్రేమ కారణంగా 2025-26 ఏడాదికి అడ్మిషన్లు నోచుకోలేదు. మరోవైపు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతులు దక్కలేదు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా విద్యార్థులు నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. అదే విషయాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై అయన ట్వీట్ చేస్తే ప్రభుత్వ పెద్దలు కళ్లు తెరిచారు. బుధవారం అడ్మిషన్లు చేపట్టేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా కేంద్రమైన కడప నగరంలో 2020లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (జేఎన్‌యూ)కి సమాంతరంగా 14 రకాల స్పెషలైజ్డ్ కోర్సులతో విశ్వవిద్యాలయాన్ని కడప నగరంలో ఏర్పాటు చేసింది. యోగి వేమన విశ్వవిద్యాలయం సమీపంలో శాశ్వత భవనాల కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ 110 ఎకరాల భూమి సైతం కేటాయించింది. రూ.350 కోట్లతో విశ్వవిద్యాలయ శాశ్వత భవనాల కోసం ఆకృతులు సైతం సిద్ధం చేశారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా శాశ్వత భవనాలకు సంబంధించి ఒక్క అడుగు కూడా పురోగతి లేదు. ఏఎఫ్‌యూ వ్యవహారాన్ని పూర్తిగా పట్టించుకోలేదు. సీఓఏ (కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్)అధికారులు అనుకూలంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. వెరసి గుర్తింపునకు నోచుకోలేదు. రెగ్యులర్ నియామకాలు లేకపోవడం మరో కారణంగా నిలిచింది. ఈఏడాది కోర్సు పూర్తి చేసుకోనున్న 63 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ఏడీసెట్ నిర్వహణ చేపట్టి నూతన అడ్మిషన్లకు శ్రీకారం చుట్టాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు నిరవధిక ఆందోళనకు దిగారు. మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వాస్తవ పరిస్థితులను వివరించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యపు ధోరణి నేపథ్యంలో అన్యాయానికి గురయ్యామని వాపోయారు. ఈ అంశాలపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. ఫలితంగా మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వ పెద్దలు మేల్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఏడీసెట్‌తో నిమిత్తం లేకుండా మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు చేపట్టాలని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా సీఓఏ అనుమతులు కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏఎఫ్‌యూలో రెండు కోర్సులకు అనుమతి

డాక్టర్ ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ) కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి 2025-26 విద్యా సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బి.డిజైన్), బ్యాచిలర్ ఆఫ్ సైన్సు అర్ట్స్ (బీఎఫ్ఏ) కోర్సుల్లో మెరిట్ ఆధారంగా నేరుగా అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతి వచ్చిందని డాక్టర్ ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. ఏపీఎస్‌సిహెచ్‌సీ చైర్మెన్ ప్రొఫెసర్ మధుమూర్తి ఆదేశాల ప్రకారం యూనివర్సిటీ బ్యాచిలర్ ఆఫ్ సైన్సు అర్ట్స్ విభాగాలైన పెయింటిగ్ ఫొటోగ్రఫీ, యానిమేషన్, స్కల్ప్చర్ అప్‌లైడ్ ఆర్ట్స్, బ్యాచిలల్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీట్లను నేరుగా అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయవచ్చని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి అర్హత పొందిన అభ్యర్థులను సంబంధింత కోర్సుల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు.

స్వేచ్ఛగా.. విహరించనీ!

చిన్నారుల జీవితాల్లో నిండిన చిరు చీకట్లను.. చిట్టిపొట్టి కథలతో దూరం చేస్తున్నారామె. పసిపిల్లల మనసు పొరల చుట్టూ అల్లుకున్న ఇక్కట్లను ముద్దు ముద్దు మాటలతో చెరిపేస్తూ కొత్త వెలుగు నింపుతున్నారు. పిల్లలు..పసి మొగ్గలై వికసించాలని.. తనలాగే స్వేచ్ఛగా విహరించాలని ఆమె కలలుగన్నారు. చిన్నారులే దేవుళ్లని భావించిన ఆమె.. వారి సేవలో తరించడమే భాగ్యమనుకున్నారు. మదిలో మెదిలిన ఆలోచనకు ఆచరణలో పెట్టారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. ఆమె పేరు స్వేచ్ఛా రెడ్డి... పేరుకు తగ్గట్లే స్వచ్ఛమైన మనసు ఆమె సొంతం. చిన్న వయస్సులోనే సేవా మార్గంలో పయనిస్తున్న 'స్వేచ్ఛా రెడ్డి' నేటి యువతకు స్ఫూర్తిదాయకం.



అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో స్వేచ్ఛా రెడ్డి



వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులతో యూనిక్ టీం

- యుక్త వయసులోనే సేవామార్గం వైపు పయనిస్తున్న స్వేచ్ఛా రెడ్డి..
- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం యూనిక్ అండ్ యునైటెడ్ స్థాపన

ప్రొద్దుటూరు : ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వేచ్ఛా రెడ్డి 'యూనిక్ అండ్ యునైటెడ్'సంస్థను స్థాపించారు. ఆ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపి వారిని పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన స్వేచ్ఛారెడ్డి హైస్కూ ల్ విద్యార్థినిగా ఉన్నారు. తనలాగే .. తోటి పిల్లలు స్వేచ్ఛగా విహరించాలని కలలుగన్నారు. పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి వారికి ప్రేమను పంచుతున్నారు. వారిలో చైతన్యాన్ని కల్పించేందుకు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'యూనిక్ అండ్ యునైటెడ్' సంస్థ సేవలు

ఆటిజం, ఏడీహెచ్‌డీ, ఇతర అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పడం 'యూనిక్ అండ్ యునైటెడ్'సంస్థ ప్రధాన లక్ష్యం. పాఠశాలల్లో ప్రత్యక్షంగా చర్చా కార్యక్రమాలతో పాటు, చిన్న చిన్న కథలు, విజువల్ ప్రజెంటేషన్ల ద్వారా వారిలో అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థుల్లో మార్పే లక్ష్యం

మానసిక సమస్యలతో ఇబ్బందులు పడే విద్యార్థుల్లో మార్పు రావాలని.. అందరి పిల్లల్లానే వారూ ఎదగాలని.. అన్నింట్లోనూ రాణించాలని స్వేచ్ఛారెడ్డి ఆశయం. దీనికోసం తన స్వస్థలమైన ప్రొద్దుటూరు నుంచే ఈ మార్పునకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ప్రొద్దుటూరులోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిర్, నారాయణ జూనియర్ కాలేజీ, వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్, విద్యా భారతి స్కూల్, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, స్కాలర్స్ హైస్కూల్, హైదరాబాద్‌లోని సమిస్టి ఇంటర్నేషనల్ స్కూల్, గండిపేట ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా..

విద్యార్థిగా స్వేచ్ఛా రెడ్డి మాటలు, ఆమె వ్యవహార శైలి ఇతర విద్యార్థులకు ఆకట్టుకునేలా ఉంటుంది. ఆమె చెప్పే కథలు, విజువల్స్, అనుభవాలు వారి మనసులను తాకేలా ఉంటాయి. హృదయాన్ని తాకే ఆమె భావోద్వేగ ప్రసంగం విద్యార్థుల్లో మార్పునకు దారి తీస్తోంది. 'యూనిక్ అండ్ యునైటెడ్'సంస్థ ద్వారా మరిన్ని పాఠశాలల్లో కార్యక్రమాలను విస్తరింపచేయాలని, ఇన్‌క్లూసివ్ విద్యను అనుసరించే గైడ్‌లను తయారు చేయాలని, తరగతి గదిలో భాగస్వామ్య వాతావరణాన్ని కల్పించాలని స్వేచ్ఛారెడ్డి లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

చెప్పులేసుకొని రొట్టెలు వదిలిన ఎమ్మెల్యే

– ముస్లింల మనోభావాలు దెబ్బతీశారని విమర్శలు



చెప్పులు వేసుకొని రొట్టెలు వదులుతున్న ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి

కడప కార్పొరేషన్ : మొహర్రం పండుగను పురస్కరించుకొని నాదర్ షా వలీ దర్గా ఉరుసుకు ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యురాలు ఆర్. మాధవి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ప్రతినిధులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం కేసీ కెనాల్‌లో రొట్టెలు వదిలే సందర్భంగా ఎమ్మెల్యే చెప్పులు వేసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంతో పవిత్రంగా రొట్టెలు వదిలే కార్యక్రంలో ఎమ్మెల్యే చెప్పులు వేసుకొని ముస్లింల మనోభావాలు దెబ్బతీశారని పలువురు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ వర్క్‌షాప్‌లో కలెక్టర్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ వర్క్ షాప్‌కు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆయన కలిశారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు కార్యకలాపాలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మంత్రికి కలెక్టర్ వివరించారు. గండికోటలో జరుగుతున్న పర్యాటక మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు.

11 చీనీ మొక్కల నరికివేత



చీనీతోటలో నరికిన చీనీ మొక్కలు

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డికి చెందిన 3.5 ఎకరాల చీనీ తోటలో 11 చీనీ చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మండలానికి ఒక కిసాన్ డ్రోన్

సిద్దవటం : ప్రతి మండలానికి 80 శాతం రాయితీపై ఒక కిసాన్ డ్రోన్ ఇస్తామని రైతు బృందాలు అధికారులను సంప్రదించాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ తెలిపారు. సిద్దవటం మండలం శాఖరాజుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్చింగ్ షీట్ పద్ధతిలో సాగు చేసిన దోస పంట పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు ఈకేవైసీ ఫింగ్ ద్వారా చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిద్దవటం వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల పంపిణీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, మురళి, రైతులు పాల్గొన్నారు.

నాపైనే పిటీషన్ వేస్తావా.. నీ అంతు చూస్తా

- బాధితుడు బాలకృష్ణారెడ్డికి పెండ్లిమర్రి ఎస్ఐ వేధింపులు
- పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి ఎన్‌కౌంటర్ చేస్తానంటూ బెదిరింపులు
- పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు సిద్ధమవుతున్న బాధితుడి భార్య, బంధువులు
- హైకోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయని ఎస్సై మధుసూదన్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : 'నా మీద హైకోర్టులో పిటిషన్ వేస్తావా.. నీ అంతు చూస్తా.. నిన్ను ఎన్ కౌంటర్ చేస్తా.. నిన్ను వదిలే ప్రసక్తే లేదు..నీ మీద తప్పుడు కేసులు పెట్టి రౌడీ షీట్ ఓపెన్ చేస్తా.. నిన్ను సబ్ జైలుకు పంపించేంతవరకూ నేను నిద్రపోను' అంటూ పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తనదైన శైలిలో ఫిర్యాదుదారుడిపై విరుచుకుపడ్డాడు. మంగళవారం సాయంత్రం పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురిచేయడంతో ఈ సంఘటన కలకలం సృష్టించింది. వ్యక్తిగతంగా, శారీరకంగా మానసిక వేదనకు గురిచేయడంతో అతడి భార్య, బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డిని మంగళవారం మధ్యాహ్నం సమయంలో నీ మీద కేసులు ఉన్నాయి.. మీకు నోటీసు ఇవ్వాలి.. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి స్టేషన్‌కు రమ్మంటున్నారు అంటూ హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి వచ్చి తీసుకెళ్లారు. ఎస్సై మధుసూదన్‌రెడ్డి అప్పటి నుంచి స్టేషన్‌కు వచ్చిన బాలకృష్ణారెడ్డిని నిర్బంధించారు. తనకు నోటీసులు ఇవ్వమని బాలకృష్ణారెడ్డి అడిగారు. వెంటనే ఎస్ఐ కోపోద్రిక్తుడై నీకు ఎందిరా నోటీసులు ఇచ్చేది. ఇప్పుడే నీ మీద గంజాయి, సారాయి స్మగ్లింగ్ తప్పుడు కేసులు పెట్టి నిన్ను సబ్ జైల్లో పెట్టేంత వరకూ నేను నిద్రపోను అంటూ బెదిరించడంతో బాలకృష్ణారెడ్డి పరిస్థితి అయోమయంగా మారింది. తప్పుడు సమాచారం.. నోటీసుల నెపంతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్సై ప్రవర్తించేలా కాకుండా రౌడీ తరహాలో ఎస్సై మధుసూదన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు పోలీసు వ్యవస్థకే కళంకం తెస్తోందని బాలకృష్ణారెడ్డి భార్య లక్ష్మీదేవి కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుటుంబంలో చిన్నపాటి ఆస్తుల వివాదాలకు సంబంధించి ఎస్సై మధుసూదన్ రెడ్డి స్టేషన్లో వేసి పోలీసు కోటింగ్ ఇవ్వడానికి ప్రయత్నించగా బాలకృష్ణారెడ్డిని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బాలకృష్ణారెడ్డి కుటుంబ ఆస్తుల వివాదం విషయంలో ఎస్సై జోక్యం చేసుకోవద్దని ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఎస్సై మధుసూదన్ రెడ్డి తన తీరు మార్చుకోకపోగా, హైకోర్టుకు వెళ్లాడనే ఉద్దేశంతో బాలకృష్ణారెడ్డిని మంగళవారం మధ్యాహ్నం సమయంలో నోటీసుల నెపంతో స్టేషన్‌కు రప్పించారు. అనంతరం అక్కడే ఎస్సై మధుసూదన్ రెడ్డి నిర్బంధించడం ఎంతవరకు న్యాయమో జిల్లా ఉన్నతాధికారులే నిర్ణయించాలని బాధితుడి బంధువులు కోరుతున్నారు.

అక్రమ నిర్బంధంపై ఎస్పీ కి ఫిర్యాదు

పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో బాలకృష్ణారెడ్డిని ఎస్సై మధుసూదన్ రెడ్డి అక్రమంగా నిర్బంధించిన విషయమై బాధితులు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారించి తాను తగిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ వివరించినట్లు సమాచారం.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం

దేశవ్యాప్త సమ్మె సభలో వామపక్ష నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలో ప్రధాన మోదీ అమలు చేస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి ర్యాలీ ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్ రోడ్స్, గోకుల్ సర్కిల్, ఒకటవ గాంధీ సర్కిల్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, మీదుగా సెవెన్ రోడ్స్ దగ్గరకు చేరింది. అక్కడ నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొస్తోందన్నారు. లేబర్ కోడ్‌లు అమలుచేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న పని గంటలను సైతం పెంచుతున్నారని, కార్మిక సంఘాల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. 73 షెడ్యూల్‌లోని మునిసిపల్, అంగన్వాడీ, ఆశా, తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందక, ఉద్యోగభద్రత లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి సమస్యలపై ఇకపై నిరసన తెలుపుకొనే అవకాశం కోల్పోతారని, ఇది నిర్బంధ నిరంకుశ విధానాలకు తార్కాణమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో, హమాలీ, వీధి విక్రయ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెబుతూ ఆదానీ, అంబానీలకు పన్నులు తగ్గిస్తూ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్, కే.శ్రీనివాసులురెడ్డి, బండి రామలింగారెడ్డి. ఉద్దె మద్దిలేటి, సుబ్బరాయుడు, జయవర్ధన్, ఓబయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు రాము, రమణయ్య, యూటీఎఫ్ నాయకులు లక్ష్మీరాజా ఎస్.వెంకటశివ, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక



30 మీటర్ల పోటీల్లో విద్యార్థులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025–26 సంవత్సరంలో నాలుగో తరగతి ప్రవేశాలకు బుధవారం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఎత్తు, జరువు, మెడికల్ టెస్ట్ , స్టాండింగ్ బ్రాడ్ జంప్, షాట్‌పుట్, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, రన్నింగ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 27 మంది హాజరుకాగా, మెడికల్ టెస్ట్ పరీక్షలో నలుగురిని తిరస్కరించారు. క్రీడా మైదానంలో అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. వివిధ కారణాలతో హాజరుకాని తొమ్మిది మంది బాల, బాలికలు ఈ నెల 11న నిర్వహించే ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. 11న ఐదో తరగతి ప్రవేశాలకు ఎంపిక జరుగుతుందని, ఆన్‌లైన్‌లో అర్హులైన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

రిమ్స్‌లో 'దళారుల దందా'..!

ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 30,000 వసూలు



దళారుల సమూహంలోని వారు వీళ్లే..

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్, నూతన సర్టిఫికెట్లను ఇప్పించే విషయంలో కడప రిమ్స్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బద్వేల్, కమలాపురం, పులివెందుల ఆసుపత్రుల ఆవరణలో దళారుల దందా యథేచ్ఛగా జరుగుతోంది. కడప సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో తమకు తాము దళారాలు సర్టిఫికెట్‌కు ఓ రేటు ఫిక్స్ చేశారు. దివ్యాంగుల నుంచి రూ.30,000 వసూలు చేసి.. ఆస్పత్రిలో పనిచేస్తున్న మీడియేటర్ ఉద్యోగికి రూ.18 వేల నుంచి 22 వేల వరకు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నూతన సర్టిఫికెట్‌కు ఇదే స్థాయిలో వసూలు చేస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం దొంగ, మోసపూరితమైన సర్టిఫికెట్ల ఏరివేతను కొనసాగిస్తూ జూలై, ఆగష్టు, సెప్టెంబర్ వరకు రీ వెరిఫికేషన్ ప్రక్రియ జరుపుతోంది. దివ్యాంగుల సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్ కాకుండా మరో డాక్టర్ పరిశీలన చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే దళారులు క్యాష్ చేసుకుంటున్నారు. అధికారులు నిఘా వుంచి దివ్యాంగులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొలతలలో తలనీలాలకు వేలంపాట



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ ఈఓ క్రిష్ణానాయక్

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాల వేలం ఈఓ క్రిష్ణానాయక్ బుధవారం నిర్వహించారు. 59.250 కిలోల తలనీలాలను ఒంగోలుకు చెందిన యాదగిరి రూ.5,05,500కు వేలం పాడి దక్కించుకున్నారు. దీంతోపాటు గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తగిరియంపల్లెలో మల్లేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన 15.48 ఎకరాల భూమిని మూడేళ్ల కౌలుకు వేలం వేయగా రూ.18,400 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావాలి

మదనపల్లె రూరల్ : ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకువచ్చేందుకు జైలు సిబ్బంది కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ అంజనీకుమార్ అన్నారు. మదనపల్లె సబ్ జైలు, డీఎస్పీ మహేంద్రతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో ప్రత్యేకంగా మాట్లాడి జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జైలు గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, మూడు నెలలకు పైగా జైలులో ఉన్న ఖైదీల వివరాలు, బెయిల్ మంజూరైనా, బయటకు వెళ్లని ఖైదీల సమాచారం, ఉచిత న్యాయసేవలపై జైలర్ లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. సీఐ ఎరీషావలీ, ఎస్ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు పెన్షన్ అదాలత్

కడప సెవెన్‌రోడ్స్ : వెబెక్స్ వేదికగా గురువారం ఉదయం 11.30 గంటలకు పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కడప రీజినల్ కార్యాలయ సీపీఎఫ్ కమిషనర్ అభిషేక్ ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే మూడు నెలల్లో పెన్షనర్లు కాబోయే ఈపీఎస్ 1995 సభ్యులు కూడా అదాలత్‌తో తమ ఫిర్యాదులకు సమాధానాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. నిబంధనలు అర్థం చేసుకోవడానికి, ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి, ఈపీఎఫ్ఓ అధికారులతో సన్నిహితంగా ఉండడానికి ఇది ప్రత్యేక వేదిక అని తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు-గిద్దలూరు రహదారిపై ఎస్ఎన్ఎస్ సెల్‌ఫోన్ దుకాణంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారని దుకాణం యజమాని నాగూర్‌వలి తెలిపారు. రూ.50 వేల విలువైన ఐదు సెల్ ఫోన్లు, రూ.5 వేల విలువ చేసే బ్లూటూత్, సీసీ కెమెరా, రూ.15 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. రాజంపేట నుంచి కొమ్మెమ్మర్రి గ్రామానికి వాహనంలో ప్రయాణిస్తుండగా ముందువైపు వెళ్తున్న వాహనం బ్రేక్ వేయడంతో దానిని ఢీకొని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రజాక్, గోవిందమ్మ, మద్దిలేటమ్మ, శివమ్మ గాయపడగా 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి వీఆర్‌కు!

జమ్మలమడుగు : రూరల్ సీఐ గోపాల్‌రెడ్డిని కర్నూల్ రేంజ్ డీఐజీ అధికారులు వీఆర్‌కు సాగనంపినట్లు సమాచారం. గత కొంత కాలంగా జమ్మలమడుగు రూరల్ సీఐపై అవినీతి ఆరోపణలతో పాటు, ఓ మహిళ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం వంటి కారణాలతో ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది. పట్టణంలో గత కొంత కాలం వరకు శక్తి టీంలో మహిళ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆ మహిళ ఎక్కువగా రూరల్ స్టేషన్‌లో గడుపుతుండటంతో సీఐ ఆమెతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నారనే ప్రచారం సాగింది. అంతేకాకుండా ఆ కానిస్టేబుల్‌ను రెండో వివాహం చేసుకుంటానని నమ్మబలకడంతో జిల్లాలో ఎక్కడ క్యాంపు డ్యూటీలు వచ్చినా సీఐతో కలిసి వెళ్లేదని స్థానిక పోలీసులు గుసగుసలాడుతున్నారు. అయితే కొన్ని రోజుల తర్వాత రూరల్ సీఐ, సదరు మహిళ మధ్య విబేధాలు రావడం, పెండ్లి మాట ఊసెత్తకపోవడంతో ఆమె నేరుగా ఎస్పీని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఉన్నతాధికారులు విచారించి సీఐ గోపాల్ రెడ్డిని వీఆర్‌కు పంపించారు. దీనికి జిల్లా ఎస్పీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు వచ్చినట్లు ధృవీకరించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లును వివరణ కోరగా తమకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని బయట ఎన్నో మాట్లాడుకోవడం సహజమేనన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప పెద్ద బెస్త వీధికి చెందిన పొట్ట సుధీర్(38) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు పెద్ద బెస్త వీధికి చెందిన సుధీర్ ప్రైవేట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువ ఉండడంతో మనస్థాపానికి గురై ఈ నెల 6న ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల్లో బ్యాటరీలు చోరీ

మదనపల్లె రూరల్ : పార్కింగ్ చేసిన వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు, డీజిల్ పెద్ద మొత్తంలో చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కదిరిరోడ్డు టిప్పుసుల్తాన్ మైదానంలో రాత్రి పెద్ద సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిలిపి ఉంచిన 30 లారీలు, మినీలారీలు, ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల నుంచి బ్యాటరీల ను దోచుకెళ్లారు. వాహనాల్లో డీజిల్ చోరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైగా ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి వా హనాలను పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యా ప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

ఎల్లలు దాటిన అభిమానం

కువైట్‌లో ఘనంగా మహానేత జయంతి



డా. వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు



కేక్ కట్ చేస్తున్న కువైట్ కమిటీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి

కడప కార్పొరేషన్ : కువైట్ దేశంలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఖైతాన్ ప్రాంతంలో ఉన్న రాజధాని రెస్టారెంట్‌లో వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి, గల్ఫ్ కోకన్వీనర్ గోవిందు నాగరాజు మాట్లాడుతూ డా. వైఎస్సార్ తన పరిపాలనలో పేద బడుగు బాలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని, పేదలకు ఆరోగ్యశ్రీ, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ పథకం, తదితర పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో రాజన్న శాశ్వతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కోర్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రమణయాదవ్, మర్రి కళ్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాదిరి తాము రెడ్‌బుక్ తరహాలో రాయగలమని, అది తమ సంస్కృతి కాదన్నారు. ఇప్పటికైనా మంత్రి లోకేష్ రెడ్‌బుక్ పాలన ప్రక్కన పెట్టి డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మీప్రసాద్, షేక్ రహంతుల్లా, షేక్ గఫార్, షాహుస్సేన్, ఎ.బాలక్రిష్టారెడ్డి, గోవిందురాజు, అప్సర్‌అలీ, అన్నాజీ, వెంకటక్రిష్ణ, ఉపాసన, వెంకటరమణారెడ్డి, షేక్ గఫార్, నరసారెడ్డి, పి.సురేష్‌రెడ్డి, అబూతురాబ్ పాల్గొన్నారు.

ఖతార్‌లో వైఎస్సార్ జయంతి

ఖతార్ దేశంలోని దోహా పట్టణంలో దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుక ఘనంగా జరిగింది. స్థానిక తాజ్ మహారాజ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ ఖతార్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఖతార్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. శశికిరణ్ మాట్లాడుతూ రాజన్న భౌతికంగా తమ మధ్య లేకపోయినా, తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వైఎస్సార్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేసి అద్భుతపాలన సాగించారన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ ప్రతినిధి వర్జిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఖతార్ కమిటీ కో కన్వీనర్లు జాఫర్ హుస్సేన్, ఆరోన్ మనీష్, ఎస్.నాగేశ్వర రావు, జయరాజు, ఎన్.లియోపోల్డ్‌కింగ్, టి.అరుణ్ కుమార్, హేమంత్, గణేష్, శివనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఖతార్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు

ఉత్సాహంగా ఏసీఏ అండర్–19 మల్టీడే మ్యాచ్



కెహెచ్.వీరారెడ్డి (133 పరుగులు)



ఆర్థిత్‌రెడ్డి (100 పరుగులు)




మహిత్ (4 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం వైఎస్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప–అనంతపురం జట్లు తలపడ్డాయి. తొలి ఇన్నింగ్స్‌లో 461 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కడప జట్టు 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్థిత్ రెడ్డి 76 బంతుల్లో సెంచరీ చేశాడు. అనంతపురం జట్టులోని కెహెచ్.వీరారెడ్డి 4 వికెట్లు, నవదీప్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 67 ఓవర్లకు 250 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కెహెచ్.వీరారెడ్డి 177 బంతుల్లో 133 పరుగులు, సాత్విక్ 41 పరుగులు చేశాడు. కడప జట్టులోని ధీరజ్ కుమార్ రెడ్డి 4 వికెట్లు, ఆర్థిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 15 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది. కడప జట్టు 319 పరుగుల అధిక్యంలో కొనసాగుతున్నది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో 11 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి చరణ్ 63 పరుగులు, బాలాజీ 55 పరుగులు చేశారు. కర్నూలు జట్టులో మహిత్ 4 వికెట్లు, మల్లి ఖార్జున 2 వికెట్లు, విఖ్యాత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 28 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ఆ జట్టులోని మురళీ హృదయ్ 60 పరుగులు, కెవి ఓంకార్ 43 పరుగులు చేశారు. కర్నూలు జట్టు 174 పరుగుల అధిక్యంలో కొనసాగుతోంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

పోలీసుల విచారణకు వస్తూ.. అస్వస్థతకు గురై



రవికుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

బద్వేలు అర్బన్ : బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ పట్టాల కేసులో విచారణకు హాజరు అయ్యేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటి పట్టాల కేసులో గత వారం రోజులుగా పోలీసులు పలువురినీ విచారిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని సుమిత్రా నగర్‌కు చెందిన డి.రవికుమార్‌ను రోజూ స్టేషన్‌కు పిలిచి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కూడా విచారణ నిమిత్తం స్టేషన్ వద్దకు వచ్చిన రవికుమార్ తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయారు. పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు తమను ఏమీ ఇబ్బంది పెట్టలేదని, వారం రోజులుగా స్టేషన్‌కు పిలిపిస్తుండటంతో భయాందోళనకు గురై నిద్ర మాత్రలు మింగారని రవికుమార్ కుటుంబీకులు తెలిపారు.

మా ఇంటి తాళాలు తెరిపించండి సారూ..



మీడియా ఎదుట మాట్లాడుతున్న రాజేశ్వరి

కమలాపురం : గత నెల 29న మా ఇంటికి కొందరు తాళాలు వేశారు.. వాటిని తెరిపించాలని కోగటం గ్రామానికి చెందిన రామిశెట్టి సతీష్ భార్య రాజేశ్వరి కోరారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ తన భర్త సతీష్ శనగల వ్యాపారం చేసి కొంతమందికి కోటి రూపాయల వరకు డబ్బు ఇవ్వాల్సి ఉందని, తమకు గ్రామంలో రూ.40 లక్షలు రావాల్సి ఉందన్నారు. నగదు అందగానే కడతామని చెప్పినా రైతులు వినకపోవడంతో ఒత్తిడి భరించలేక తన భర్త ఇంటినుంచి వెళ్లిపోయాడన్నారు. దీంతో రైతులు గత నెల 29న తమ ఇంటికి తాళం వేశారని, అప్పటి నుంచి తాను, తన పిల్లలు బంధువుల ఇంట్లో తలదాచుకున్నామని తెలిపారు. ఎస్పీకి ఫిర్యాదు చేసి.. కమలాపురం ఎస్ఐ వద్దకు వచ్చామని, ఇంటికి తాళం వేసిన వారి వివరాలతో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరిస్తామని ఎస్ఐ తెలిపారన్నారు. ఇదిలా ఉంటే ఆరేళ్ల క్రితం రైతుల వద్ద శనగలు కొనుగోలు చేసి డబ్బు ఇవ్వకుండా తిప్పుతున్నాడని బాధితులు బషీర్, సుబ్బారెడ్డి, సాంబ శివారెడ్డి తదితరులు గతంలో కమలాపురం పోలీస్ స్టేషన్, తహసీల్దారు కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరగలేదని బాధిత రైతులు సతీష్ ఇంటికి తాళం వేసినట్లు తెలిసింది.

ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్



తనిఖీలు చేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు,కు వంద మీటర్ల విద్యా సంస్థలకు వంద మీటర్ల దూరంలో బుధవారం ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఇజి.అశోక్‌కుమార్ ఆదేశాలతో పోలీస్ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాల, విద్యా సంస్థలను సందర్శించి వంద మీటర్ల లోపు టీ షాపులు, పాన్ షాపులు, కిరాణం షాపులలో సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తుల తనిఖీలు చేసి వాటి అమ్మకాలు నిషేధమని దుకాణదారులకు తెలిపారు. విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణ యజమానులకు కోప్టా యాక్టు ప్రకారం జరిమానా విధించారు.